



Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com






ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 651 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర గురువారం 29 జనవరి 2026 పేజీలు : 4 వెల : అమూల్యం






సత్యానికి స్వరం పత్రిక కలం,
ప్రజల గుండెల్లో వెలిగే దీపం.
న్యాయానికి దారి చూపే దీప్తి,
లోకానికి జ్ఞానం పంచే శక్తి.
సమాజానికి కళ్లుగా మారి,
అన్యాయంపై ప్రశ్నించే ధైర్యం.
పత్రికా స్వేచ్ఛకు వందనాలు,
వార్తల వెలుగుకు శుభాకాంక్షలు!
- జాతీయ వార్త పత్రిక దినోత్సవ శుభాకాంక్షలు

# రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే ప్రాజెక్టుల పురోగతి, కొత్త మార్గాల ఏర్పాటుపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. సచివాలయంలో దక్షిణ మధ్య, తూర్పు కోస్తా, దక్షిణ కోస్తా రైల్వే డివిజన్ల జనరల్ మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో రైలు కనెక్టివిటీని మెరుగుపరచడం ద్వారా ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రంలోని వివిధ పోర్టుల నుంచి తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని హింటర్ ల్యాండ్‌కు సరుకు రవాణాను పెంచేందుకు అవసరమైన రైలు అనుసంధానంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. అలాగే, రాయలసీమ ప్రాంతాల నుంచి కోస్తాంధ్రలోని వివిధ ప్రాంతాలకు కనెక్టివిటీని మెరుగుపరిచే అంశాలపైనా సమీక్షించారు. విశాఖపట్నం, విజయవాడ, గుంతకల్, గుంటూరు, రేణిగుంట వంటి ప్రధాన జంక్షన్లలో రైళ్ల రద్దీని తగ్గించే మార్గాలపై అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విజయవాడ బైపాస్, భద్రాచలం రోడ్-కొవ్వూరు వంటి కొత్త రైల్వే లైన్ల ప్రతిపాదనల పురోగతిని కూడా సీఎం సమీక్షించారు. గిరిజన ప్రాంతాలకు రైలు



సౌకర్యాన్ని విస్తరించడంపై ప్రత్యేకంగా చర్చించారు. హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు, హైదరాబాద్-బెంగళూరు మార్గాలను హై స్పీడ్ రైల్వే కారిడార్లుగా అభివృద్ధి చేసే ప్రణాళికలపైనా ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రైల్వే నెట్‌వర్క్ విస్తరణ కీలకమని ఈ సందర్భంగా చంద్రబాబు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.

# పిఠాపురం రైల్వే స్టేషన్‌ను మోడల్ స్టేషన్‌గా అభివృద్ధి చేయండి

- రోడ్డు ఓవర్ బ్రిడ్జిని పీఎం గతిశక్తి పథకంలో చేర్చండి

-కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ని కోరిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్




ఢిల్లీ, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాండ్ర, జనవరి 28 : రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం మధ్యాహ్నం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని శ్రీవైష్ణవ్ తో సమావేశం అయ్యారు. పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి, రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతోపాటు పలు అంశాలపై చర్చించారు. సేతు బంధన్ పథకం కింద మంజూరు చేసిన రోడ్డు ఓవర్ బ్రిడ్జిని పీఎం గతిశక్తి పథకం పరిధిలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఇది 2030 జాతీయ రైల్ ప్రణాళికకు అనుగుణంగా లెవల్ క్రాసింగులు తొలగించేందుకు, ట్రాఫిక్ నియంత్రణకు సహకరిస్తుందని తెలిపారు. పిఠాపురం ఆధ్యాత్మికంగా ముఖ్య పట్టణం అయినందున రైల్వే స్టేషన్ ను అమృత్ స్కీం కింద మోడల్ రైల్వే స్టేషన్ గా అభివృద్ధి చేయాలని కోరారు. అష్టాదశ శక్తిపీఠం, శ్రీ పాద శ్రీ వల్లభ స్వామి కొలువైన క్షేత్రం పిఠాపురంలో ఉన్నందున దర్శనం నిమిత్తం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. వీటితోపాటు రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న పలు రైల్వే ప్రాజెక్టుల గురించి పవన్ కళ్యాణ్ చర్చించారు. అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించినందుకు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు.



# వికసిత్ భారత్‌కు 2026 పునాది సంవత్సరం: రాష్ట్రపతి ముర్ము

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఢిల్లీలోని పార్లమెంట్‌లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 29న (గురువారం) ఆర్థిక సర్వేను, ఫిబ్రవరి 1న (ఆదివారం) కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ.. గడిచిన ఏడాది వేగవంతమైన ప్రగతి, గొప్ప సాంస్కృతిక వారసత్వానికి గుర్తుగా నిలిచిపోయిందన్నారు. 'వికసిత్ భారత్' నిర్మాణంలో 2026వ సంవత్సరం ఒక కీలకమైన పునాది సంవత్సరంగా నిలుస్తుందని ఆమె అభివర్ణించారు. గత దశాబ్ద కాలంలో భారత్ అన్ని ప్రధాన రంగాలలో తన పునాదులను పటిష్ఠం చేసుకుందని, భవిష్యత్ వృద్ధికి బలమైన మార్గాన్ని నిర్మించుకుందని పేర్కొన్నారు. బంకించంద్ర ఛటర్జీ రచించిన 'వందేమాతరం' గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న వేడుకలను ఆమె గుర్తుచేశారు. శ్రీ గురు తేజ్ బహదూర్ జీ 350వ షహీదీ దివస్, బిర్సా ముండా, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను ప్రస్తావించారు. దేశం తన పూర్వీకుల సేవలను గౌరవించుకున్నప్పుడు, యువతరంలో స్ఫూర్తి రగులుతుందని, అది అభివృద్ధి చెందిన భారత్ దిశగా దేశ ప్రయాణాన్ని వేగవంతం చేస్తుందని రాష్ట్రపతి తెలిపారు. కాగా, సమావేశాలకు ముందు మంగళవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరిస్తామని నేతలు హామీ ఇచ్చారు. ఓట్ల దొంగతనం ఆరోపణలు, ఓటర్ల జాబితా సవరణ, ధాన్యం సేకరణ, ఉపాధి హామీ పథకం వంటి ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తామని కాంగ్రెస్ పార్టీ ఈ సమావేశంలో తెలిపింది

# మేడారం - ఆది సంస్కృతికి అద్దం!

అక్కడ మారుమోగుతుంది శరణు ఘోష
కనిపించని గుడి ఆనవాళ్లు
విగ్రహం లేని మనోనిగ్రహ దేవాలయం
వినిపించని వేదమంత్రపు సందేశం...

సైన్యాన్ని గడగడలాడించిన వనదుర్గలు వీరు
వీరోచితంగా పోరాడిన గిరిజన శౌర్యమూర్తులు
కుంకుమ భరిణెగా వెలిసిన అపర శక్తులు
భక్తుల కొంగుబంగారమై నిలిచిన అమ్మలు..

లక్షలాది భక్తుల్లో అనంత విశ్వాసం
జంపన్న వాగులో మునుగుతూ
వన దేవతలను కళ్లారా చూస్తూ
మనసులో ప్రతిష్ఠించిన ఆనంద ప్రతిమలు..

అడవి తల్లి ఒడిలో తీయని అనుభూతి
గిరిజన ఆచారాల్లో మహోన్నత ఉత్సవం
పొర్లు దండాలు పోటెత్తగా
ఎదురుకోళ్లు గాలిలో ఎగురుతున్నాయి..

ప్రకృతిలో మమేకమైన దేవతలు
మేడారంలో సరికొత్త శోభాయమానంగా
ఆది సంస్కృతికి వైభవంగా
సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుంది..

ప్రపంచంలోనే పెద్ద జాతరగా
గిరిజన బిడ్డల ఆత్మాభిమాన ప్రతీకగా
తెలంగాణ కుంభమేళాగా
ఆకుపచ్చని అడివి జనసందోహ పండుగ..

గద్దెలే దైవంగా ముస్తాబై
రాతి వనాలే స్వాగత తోరణాలై
సమ్మక్క సారలమ్మ గిరిజన దేవతలుగా
వన దేవతల ఒడిలో విరాజిల్లుతున్నారు..

బెల్లమే తులాభారంగా తూగుతూ
భక్తుల మనోభావాలే పరిమళిస్తూ
బెల్లమే 'బంగారమై' మారిపోతూ
ఇష్ట దైవాలకు నైవేద్యమై నిలిచింది..

లయబద్ధ డప్పుల చప్పుళ్లతో
గిరిజన నృత్యాల పాటలతో
మేడారం హోరెత్తిపోతుంది జాతర
తరతరాలు చెప్పుకునే దివ్యమైన చరిత్రగా



- కొప్పుల ప్రసాద్
నంద్యాల
9885066235



## ఏపీ.సి.ఆర్.పి.ఎఫ్ మహిళా ప్రెసిడెంట్ మల్లె రవణమ్మ సొంత ఖర్చులతో మధ్యాహ్నం భోజనం సరఫరా

మార్కాపురం జిల్లా ప్రతినిధి సింహగర్జన (ముత్యాల నరేష్ రెడ్డి) జనవరి 28 : ముత్తంవారి పల్లె ప్రాథమిక పాఠశాలలో వంట చేసి అందిస్తున్న ఆమె కుటుంబ కారణాల రీత్యా బుధవారం విద్యార్థులకు భోజనాల అందించలేదు. అక్కడున్న ప్రధానోపాధ్యాయులు వంట చేసే వారిని కొంతమంది అడగగా నిరాకరించారు. అది తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం మార్కాపురం జిల్లా కందుకూరు డివిజన్ మహిళా ప్రెసిడెంట్ మల్లె రమణమ్మ తానే సొంతంగా తయారు చేసి విద్యార్థులకు భోజనం అందించారు. తన సొంత ఖర్చులతో పాఠశాలలో తన వంతు బాధ్యతగా సరైన సమయానికి విద్యార్థులకు భోజనం అందించినందుకు ఆమెకు ఉపాధ్యాయులు, ఆంధ్రప్రదేశ్ కన్జ్యూమర్ రైట్స్ ప్రొడక్షన్ ఫోరం మనసారా అభినందనలు తెలియజేశారు.

# కవితా సమీక్ష – ప్రేమ పావురం

మారాం చేస్తుంది
మాయ చేస్తుంది
మమతల్ని పంచేసి బాధల్ని మటుమాయం చేస్తుంది
దూరాన్ని దగ్గర కామంటుంది
దగ్గరయ్యి చిలిపి కబుర్లు చెప్తుంది
వేవేలా అనుభూతుల్ని అనుబంధంగా మారుస్తుంది
ఆంతర్యానికి అద్దం పట్టి మమేకమైపోమంటుంది
మనసు కదా
కన్నీటి సుడిగుండాలను తప్పించి సంతోషాన్నే కోరుకుంటుంది
వ్యధలెన్నున్నా అన్నిటినీ వంచించి
ప్రేమ పావురమై ఎగిరిపోతుంది...

కొన్ని కవిత్వాలు మనసుని కట్టిపడేస్తాయి అంటే ఏంటో అనుకున్నా, ఈ కవిత్వం చదివిన తర్వాత అనిపిస్తుంది మనసు స్వచ్ఛతను ఎంతలా కోరుకుంటుందో, బాధని వదిలేసి బంధానికి విలువనిచ్చి, పగిలిన గుండెకి మరుపనే లేపనాన్ని పూస్తూ, ఉన్నంతకాలం సంతోషంగా ఉండమని, మనసుతో బంధాలను పెనవేసుకోమని, అద్భుతమైన భావాలను అందిస్తూ అతిశయోక్తి లేకుండా అర్థవంతంగా ఈ కవనాన్ని లిఖించారు రచయిత...

- ఇక కవిత్వం విషయానికి వస్తే...
- మనసు కదా...!
వద్దు ! వద్దని గట్టిగా తీర్మానించుకున్నప్పుడే
మరింత మొహమాట పెడుతుంది
ఎంతైనా మనసు కదా..!

నీరెండ తళుకు బెళుకుల్లో అందాలు మెరిసినట్టు
జ్ఞాపకాలను రసరమ్యంగా
గూట్లో పొదువుకుంటుంది..
విశాలమైన ఆలోచనల ఆవరణంలో నిరంతరం సంచరిస్తూ
ఆశల ఇంద్రధనువులా విప్పారుతుంది..
కొంచెం సంతోషానికే ఆనందాల రెక్కలతో తూనీగలా విహరిస్తుంది

రెండు కలల పుటలను తిరగేసి రాతిరి పుస్తకపు నిద్రా పఠనాన్ని మధుర కావ్యంగా లిఖించుకుంటుంది...

తెల్లారేసరికి దోసిలికెత్తుకున్న స్వప్న సుమాలతో
కొత్త ఉషోదయానికి స్వాగతాంజలి ఘటిస్తుంది...

మౌనమై
మది విపంచి
సప్త స్వరాలను పలుకుతుంది

ప్రేమ హస్తాల్లోంచి
గాజు సీసా జారి ముక్కలైనట్లు
మోసపు మెట్ల మీద పడి బద్దలైనప్పుడే
విషాదగీతంలో కుదరని పల్లవై
నిందాస్వరమై తేలిపోతుంటుంది...




రచయిత : దాకరపు బాబూరావు

సమీక్ష : పోలగాని భానుతేజశ్రీ

- రచయిత : దాకరపు బాబూరావు

- సమీక్ష

అదేంటో
వద్దని గట్టిగా తీర్మానించుకున్నప్పుడే మరింత మొహమాట పెడుతుంది, నీరెండ తళుకు బెలుకుల్లో అందాలు మెరిసినట్టు జ్ఞాపకాలను రస రమ్యంగా గూట్లో పొదువుకుంటుంది మనసు... విశాలమైన ఆలోచనల ఆవరణంలో నిరంతరం సంచరిస్తూ ఆశల ఇంద్రధనవులా విప్పారుతుంది అంటూ మనసు రెక్కలు కట్టుకుని అనుక్షణం సంచరిస్తూనే ఉంటుందని, ఒక్కోసారి మొహమాట పడుతుందని, జ్ఞాపకాలను గుండెల్లో పొదువుకుని, ఆలోచనలతో సహవాసం చేస్తూ రంగురంగుల ఇంద్రధనస్సులా ప్రకాశిస్తూనే ఉంటుందని ఎంతో ఉన్నతమైన పోలికలతో వర్ణించి చెప్పారు రచయిత...

కొంచెం సంతోషానికే ఆనందాల రెక్కలతో తూనీగలా విహరిస్తుందని, పుస్తకపు నిద్ర పఠణాన్ని మధుర కావ్యంగా లిఖించుకుంటుందని, తెల్లారేసరికి దోసిలికెత్తుకున్న స్వప్న సుమాలతో కొత్త ఉషోదయానికి స్వాగతాంజలి ఘటిస్తుందని , ఉన్నతమైన భావాలను సమకూర్చుతూ ఒక్కో పదానికి ఉన్న ఆంతర్యాన్ని అర్థవంతంగా వివరించడం ఈ కవికి వెన్నతో పెట్టిన విద్య కాబోలు...
కాస్త సంతోషానికే తబ్బిబ్బులై ఆకాశంలో తేలిపోతుందని, జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ మధుర కావ్యాలను లిఖించుకుంటుందని కొంగొత్త అర్థాలు వచ్చే విధంగా వర్ణించడంలో మీకు మీరే సాటి...
మౌనమై మది విపంచి సప్త స్వరాలను పలుకుతుందని, ప్రేమ హస్తాల్లోంచి గాజు సీసా జారి ముక్కలైనట్లు
మోసపు మెట్ల మీద పడి బద్దలైనప్పుడే
విషాదగీతంలో కుదరని పల్లవై
నిందాస్వరమై తేలిపోతుంటుందని రచయిత కవిత్వాన్ని రచించిన తీరు ఒకింత ఆలోచించే విధంగా ఉందనడంలో ఎలాంటి ఆంతర్యం లేదు,
మౌనమై సప్త స్వరాలు పలకడం,
ప్రేమ హస్తాల్లోంచి గాజు సీసా జారి మోసపు మెట్ల మీద పడి బద్దలవ్వడం,
విషాదగీతంలో మునిగి మొత్తానికి ప్రేమ వివస్త్ర అయ్యిందంటూ అతను చెప్పిన తీరు అద్భుతం....
నిజమే మనసొక పిచ్చిది, మాటలనే నమ్మేసి మోసపోయే ఎర్రిది, ఎన్ని అగచాట్లను ఎదుర్కొన్న మళ్లీ నమ్మేసే తింగరిది...
ఇలాంటి మరెన్నో ఉన్నతమైన కవనాలు మీ కలం నుంచి ఉద్భవించాలని, ఈ సాహితీ ప్రపంచంలో మీ రచనలు ఉన్నతమైన స్థాయిలో వెలగాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను.
- సమీక్ష : పోలగాని భానుతేజశ్రీ

## ఎస్.ఎస్.సి క్వశ్చన్ బ్యాంక్స్ పంపిణీ చేసిన ఎస్టియు నేత బైరెడ్డి వెంగళ రెడ్డి




మార్కాపురం జిల్లా ప్రతినిధి, సింహగర్జన (ముత్యాల నరేష్ రెడ్డి) జనవరి 28 : పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో 34 మంది విద్యార్థులు అందరూ పాస్ కావడానికి ఉపయోగకరమైన ఎస్.ఎస్.సి క్వశ్చన్ బ్యాంక్స్ ను ఎస్టీయూ నేత బైరెడ్డి వెంగళరెడ్డి అంబవరం జిల్లా పరిషత్ స్టాఫ్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి మంచి రిజల్ట్స్ సాధించాలని, చదువు చెబుతున్న ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు.

# మలక్ బాబా దర్గా విషయంలో నారా లోకేష్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరి పట్ల బీసీవై అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ తీవ్ర ఆగ్రహం

మంగళగిరి, సింహగర్జన ప్రతినిధి, జనవరి 28 : గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నౌలూరు గ్రామంలో ఉన్న హజ్రత్ సయ్యద్ మలక్ హుస్సైన్ అవులియా దర్గా (మలక్ బాబా దర్గా) విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే మరియు సకల శాఖల మంత్రి నారా లోకేష్ అవలంబిస్తున్న వైఖరి అత్యంత దురదృష్టకరమని భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) తీవ్రంగా ఖండిస్తోందని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ తెలిపారు. ఇది అభివృద్ధి పేరుతో మతపరమైన వివక్షకు పాల్పడుతున్న చర్యగా బీసీవై భావిస్తోందని ఆయన అన్నారు. ఏపిసిఆర్డిఏ జారీ చేసిన =ష.చీశీ.వీూఖ61-ూూ+0జజవీూ/6/2025-ూూ+ ఉత్తర్వు ద్వారా, జు13 రోడ్ విస్తరణలో భాగంగా కేవలం 15 అడుగుల మేర రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని కోరిన మలక్ బాబా దర్గా నిర్వాహకుల విజ్ఞప్తిని తిరస్కరించడం అత్యంత అన్యాయమని రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు. ఇది ఒక ఆధ్యాత్మిక స్థలాన్ని ఉద్దేశ్యపూర్వకంగా లక్ష్యంగా చేసుకున్న ఏకపక్ష నిర్ణయంగా కనిపిస్తోందని ఆయన అన్నారు. మంగళగిరి నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్న నారా లోకేష్, స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యతను విస్మరించి, ఒక మత ప్రార్థనా మందిరం భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే విధంగా వ్యవహరించడం దుర్మార్గమని రామచంద్ర యాదవ్ విమర్శించారు. "సకల శాఖల మంత్రి"గా చెప్పుకునే నారా లోకేష్‌కు ప్రజల విశ్వాసాలు, భావోద్వేగాలు కనిపించకపోవడం బాధాకరమని అన్నారు. నెల్లూరు సమీపంలో హైవే నిర్మాణంలో ఒక దర్గా అడ్డొచ్చినప్పుడు, దర్గాను కదిలించకుండా హైవే డిజైన్‌ను మార్చి, దర్గాను హైవే డివైడర్ మధ్యలో వచ్చేలా ప్లాన్ చేసి నిర్మాణం పూర్తి చేసిన ఉదాహరణలు ఉన్నాయని రామచంద్ర యాదవ్ గుర్తుచేశారు. అలాగే విజయవాడ బ్యారేజి దర్గా విషయంలో కూడా బ్రిడ్జి ప్లాన్‌ను మార్చి దర్గాను పూర్తిగా రక్షించారని తెలిపారు. అప్పుడు సాధ్యమైనది, మంగళగిరిలో మాత్రం ఎందుకు అసాధ్యమవుతోందని నారా లోకేష్‌ను ఆయన ప్రశ్నించారు. ఇది అభివృద్ధి సమస్య కాదని, రాజకీయ ఉద్దేశ్యంతో మత ప్రార్థనా మందిరాలపై కక్ష సాధింపుగా తీసుకున్న నిర్ణయమని రామచంద్ర యాదవ్ ఆరోపించారు. ముఖ్యంగా నారా లోకేష్ పరిధిలోనే ఉన్న ప్రాంతంలో ఒక దర్గా విషయంలో ఈ విధమైన కఠిన వైఖరి అనుమానాలకు తావిస్తోందని ఆయన అన్నారు. మలక్ బాబా దర్గా ఒక భవనం మాత్రమే కాదని, అది వందల సంవత్సరాల విశ్వాసానికి, మత సామరస్యానికి ప్రతీక అని రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు. ఇలాంటి పవిత్ర స్థలాలను తాకడం ద్వారా మంగళగిరి ప్రాంతంలో శాంతి భద్రతలకు భంగం కలిగే ప్రమాదం ఉందని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నారా లోకేష్ అభివృద్ధి గురించి మాట్లాడుతున్నారా? లేక మతపరమైన గుర్తింపులను తొలగించే రాజకీయ ప్రయోగం చేస్తున్నారా? స్థానిక ఎమ్మెల్యేగా, మంత్రిగా ఆయన ఒక్కరోజైనా ఈ దర్గా వద్దకు వచ్చి సమస్యను ప్రత్యక్షంగా అధ్యయనం చేశారా? అని రామచంద్ర యాదవ్ నేరుగా ప్రశ్నించారు. బీసీవై తరపున రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యంగా నారా లోకేష్‌ను మలక్ బాబా దర్గా విషయంలో ఏపిసిఆర్డిఏ జారీ చేసిన ఉత్తర్వును వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రత్యామ్నాయ రోడ్డు అలైన్‌మెంట్‌ను ప్రకటించి దర్గాను సంపూర్ణంగా రక్షించాలని, అన్ని మత ప్రార్థనా మందిరాల పట్ల సమాన వైఖరి



పాటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, నారా లోకేష్ ఈ అంశాన్ని తేలికగా తీసుకుంటే, బీసీవై ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు, న్యాయపోరాటాలు చేపడతామని రామచంద్ర యాదవ్ హెచ్చరించారు. మలక్ బాబా దర్గా విషయంలో జరిగే ఏ అన్యాయాన్నైనా ముస్లిం సమాజం, ప్రజాస్వామ్యవాదులు మౌనంగా చూడరని ఆయన స్పష్టం చేశారు.

# ఈ నెల 31వ తేదీన అన్నవరం దేవస్థానం డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా




అన్నవరం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 28 : ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న దేవస్థానం డిగ్రీ కళాశాలలో ఈ నెల 31వ తేదీన శనివారం "జాబ్ మేళా" నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆర్.రామ్మోహన్ రావు తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐసాన్ ఎక్స్పీరియన్స్ కంపెనీలో టెలిసేల్స్ రిప్రెజెంటేటివ్ పోస్టులకు, డెక్కన్ కెమికల్స్ లో ట్రైనీ (ప్రొడక్షన్ & మెకానికల్ మెయింటెనెన్స్), కెమిస్ట్, సీనియర్ కెమిస్ట్, జూనియర్ కెమిస్ట్ పోస్టులకు మరియు యాక్సిస్ బ్యాంక్ లో ఆపరేటర్/అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు, అపోలో టైర్స్ లో ట్రైనీ పోస్టులకు, అలాగే ఇసుజు మోటార్స్, ఇండో ఎం.ఐ.ఎం, ఇంజీ, హ్యాండాయ్ మోబిస్, కె.ఐ.ఎం.ఎల్, టి.హెచ్.కె, పానాసోనిక్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా టాటా ఎలక్ట్రానిక్స్, ఫాక్స్కాన్ కంపెనీల్లో మొబైల్ ఆపరేటర్ ఉద్యోగాలకు కూడా ఎంపిక ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎస్.ఎస్.సి, ఇంటర్, డిగ్రీ, ఐ.టి.ఐ, డిప్లొమో, బి.ఎస్.సి (కెమిస్ట్రీ), బి.టెక్ లలో ఉత్తీర్ణులై 36 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేలు నుండి రూ.23 వేలు వరకు జీతంతో పాటు ఉద్యోగాన్ని బట్టి ఇన్సెంటివ్స్, భోజనం, వసతి మరియు రవాణా సదుపాయాలు కల్పించబడతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు మరియు జెరాక్స్ కాపీలతో ఎస్.వి.వి.ఎస్.డి డిగ్రీ కాలేజ్ వద్ద హాజరుకావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు ఈ క్రింది నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. 80744 44217, 80088 72860.

## డా. ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా ఏఎస్ఆర్ హోమియోపతిక్ మెడికల్ కాలేజ్‌లో నూతన వైద్య విద్యా శకానికి నాంది

### - భారతదేశంలో తొలిసారి సమగ్ర టెక్ ఇంటిగ్రేషన్ ప్రారంభం




తాడేపల్లిగూడెం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 28 : తాడేపల్లిగూడెంలో ఉన్న ఏఎస్ఆర్ హోమియోపతిక్ మెడికల్ కాలేజ్ & హాస్పిటల్ లో బుధవారం 202526 బ్యాచ్ బి.హెచ్.ఎం.ఎస్ విద్యార్థుల కోసం ఘనంగా వైట్ కోట్ సెరిమనీ నిర్వహించారు. ఈ సందర్భంగా హోమియోపతి వైద్య విద్యలో దేశంలోనే ఒక చారిత్రాత్మక మైలురాయి నమోదైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. ఎన్‌టిఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ ఛాన్సలర్ డా. పి. చంద్రశేఖర్ భారతదేశంలో తొలిసారిగా హోమియోపతిక్ మెడికల్ కాలేజ్‌లో సంపూర్ణ టెక్నాలజీ ఆధారిత విద్యా విధానం "ూాూ= ఎవఎమ్త్ర ×శ్వవస్త్రతీఖ్వ" ను అధికారికంగా ప్రారంభించారు. ఇది హోమియోపతి వైద్య విద్యలో ఒక కొత్త యుగానికి నాంది అని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. వైట్ కోట్ వేడుక వైద్య వృత్తిలోకి అడుగు

వైట్ కోట్ సెరిమనీ ద్వారా 1వ సంవత్సరం బి.హెచ్.ఎం.ఎస్ విద్యార్థులు వైద్య వృత్తిలోకి అధికారికంగా అడుగుపెట్టారు. తెల్ల కోటు, స్టెథస్కోప్ ధరించి వారు నైతిక విలువలు, సేవాభావం, రోగుల పట్ల కరుణతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆనంద కుమార్ పింగళి ఆధ్వర్యంలో 2025-2026 బ్యాచ్ విద్యార్థులు హిప్పోక్రటిక్ మరియు హానిమానియన్ ప్రమాణాలు చేశారు. ఈ సందర్భంగా హోమియోపతి వ్యవస్థాపకుడు డా. శామ్యూల్ హానిమాన్ చిత్రపటానికి వైస్ ఛాన్సలర్ పూలమాల వేసి నివాళు లర్పించారు. అలాగే డా. ఎన్‌టిఆర్ యూనివర్సిటీ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన ఏఎస్ఆర్ విద్యార్థులకు వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా బంగారు పతకాలను అందజేశారు.

- హోమియోపతి విద్యలో తొలిసారి టెక్ ఇంటిగ్రేషన్ ఏఎస్ఆర్ హోమియోపతిక్ మెడికల్ కాలేజ్ ప్రారంభించిన ఈ ఎవఎమ్త్ర ×శ్వవస్త్రతీఖ్వ ప్రోగ్రాం, కేంద్ర ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ కమిషన్ ఫర్ హోమియోపతి సూచించిన సిబిడిసిను పూర్తిగా అమలు చేయడానికి రూపొందించబడింది.
- ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా :
- ప్రతి విద్యార్థికి అత్యాధునిక ల్యాప్‌టాప్‌లు అందించబడ్డాయి.
- ఎల్సేవీర్ వారి కంప్లీట్ అనాటమీ 3ఐ యాప్, ఇది మానవ శరీర నిర్మాణ నిర్మాణాలను వివరంగా అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తుంది.
- ఎశీఎజూఫ్త్ర జుశ్రీత్వ హోమియోపతి సాఫ్ట్‌వేర్, ఇది 12 రెపర్టరీలు, 800కు పైగా హోమియోపతి పుస్తకాలు మరియు వేల సంఖ్యలో మెటీరియా మెడికా ఔషధాలను కలిగి ఉన్న సమగ్ర వేదిక.
- ూ× ఆధారిత అధ్యయన విధానం ప్రవేశపెట్టారు.

ఇవన్నీ కలిపి విద్యార్థులను భవిష్యత్ వైద్య ప్రపంచానికి సిద్ధం చేయడమే లక్ష్యమని యాజమాన్యం తెలిపింది.

వైస్ ఛాన్సలర్ డా. పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏఎస్ఆర్ కాలేజ్ తీసుకున్న ఈ ముందడుగు హోమియోపతి విద్యలో దేశానికి దిశ చూపే



కార్యక్రమం. డా. ఎన్.టి.ఆర్. ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆయుష్ వ్యవస్థలకు మద్దతు ఇవ్వడానికి మరియు వాటిని పెంపొందించడానికి ప్రగాఢంగా కట్టుబడి ఉంది. ఈ ఏడాది నుంచి పరిశోధన నిధులను రెట్టింపు చేస్తున్నాం, పరిశోధన కార్యకలాపాలను గణనీయంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా విశ్వవిద్యాలయం పనిచేస్తుంది. పరిశోధనను మెరుగుపరచడానికి మరియు విద్య నాణ్యతను కాపాడుకోవడానికి విశ్వవిద్యాలయం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. ఈ ప్రతిష్టాత్మక హోమియోపతిక్ వైద్య కళాశాలను విజయవంతంగా నడపడంలో ఛైర్మన్ డా. అకుల విజయ వర్ధన్ అచంచలమైన కృషిని నేను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. హోమియోపతి వేగంగా అభివృద్ధి చెందుతున్న విజ్ఞానశాస్త్రం. దాని స్థాపకుడు డా. శామ్యూల్ హానిమాన్ అద్భుతమైన ఆవిష్కరణలు చేశారు. హోమియోపతిక్ చికిత్స ఒక సురక్షితమైన, ప్రభావవంతమైన మరియు నిరంతరం అభివృద్ధి చెందుతున్న వైద్య విధానం అని అన్నారు. ఛైర్మన్ డా. అకుల విజయ వర్ధన్ మాట్లాడుతూ తమ విద్యార్థులకు నాణ్యమైన హోమియోపతి విద్య అందించడమే ఏఎస్ఆర్ లక్ష్యం. వైస్ ఛాన్సలర్ ప్రారంభించిన ఈ సమగ్ర సాంకేతిక విలీనం, ఆ నిబద్ధతకు నిదర్శనం. మా విద్యార్థులు హోమియోపతిక్ సూత్రాలలో బలమైన విద్యను మాత్రమే కాకుండా, భవిష్యత్-దృష్టితో కూడిన మరియు డిజిటల్‌గా సాధికారత పొందిన విద్యను పొందేలా ఇది నిర్ధారిస్తుంది అన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా. ఆనంద కుమార్ పింగళి మాట్లాడుతూ నేషనల్ కమిషన్ ఫర్ హోమియోపతి సిఫార్సు చేసిన మరియు డా. ఎన్.టి.ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆమోదించిన కాంపిటెన్సీ బేస్డ్ డైనమిక్ కరికులంను పూర్తిగా అమలు చేయాలనే లక్ష్యంతో ఈ ఎవఎమ్త్ర ×శ్వవస్త్రతీఖ్వ ప్రారంభించాం. కృత్రిమ మేధస్సును వైద్య విద్యలో ఉపయోగించుకొని, మంచి పురోగతిని సాధించవచ్చు. 3ఐ అనాటమీ, అధునాతన హోమియోపతిక్ సాఫ్ట్‌వేర్ - హోంపథ్ ఎలైట్ (నూవీూాూ౦ జుూ×ుజు)ను విలీనం చేయడం మరియు విద్యార్థులందరికీ ల్యాప్‌టాప్‌లను అందించడం ద్వారా, ఏఎస్ఆర్ హెచ్ఎంసి విద్యా ఆవిష్కరణలలో ముందుండటానికి క్రియాశీలక అడుగు వేసింది. ఇది విద్య నాణ్యతను గణనీయంగా పెంచి హోమియోపతి వైద్య విద్యార్థులను నాయకులుగా తీర్చిదిద్దుతుంది అని అన్నారు. ఈ కీలక కార్యక్రమానికి విశిష్ట అతిథులు, సివిల్ సర్జన్ & సూపరింటెండెంట్, ఏరియా హాస్పిటల్ తాడేపల్లిగూడెం డా. వీరంకి రవి పాల్, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డా. విజయ్ సృజిత్, అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు. ఏఎస్ఆర్ హెచ్ఎంసి యొక్క ఈ అద్భుతమైన కృషి, వైద్య విద్యలో ఇలాంటి పురోగతులను దేశవ్యాప్తంగా ప్రేరేపించడానికి సిద్ధంగా ఉంది. అంతిమంగా, భారతదేశంలో హోమియోపతి మరియు విస్తృత వైద్య రంగానికి ఇది గణనీయంగా దోహదపడుతుంది.

## రైతులందరూ ఫిబ్రవరి 20వ తేదీలోగా ఈ పంట నమోదు తో పాటు ఈ కేవైసీ కూడా చేయించుకోవాలి

### రేపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి మహేష్ బాబు

రేపల్లె రేపల్లె మండలంలోని రైతు సోదరులందరూ ఫిబ్రవరి 20వ తేదీలోగా ఈ పంట నమోదు తో పాటు ఈ కేవైసీ కూడా చేయించుకోవాలని రేపల్లె మండల వ్యవసాయ శాఖ అధికారి ఏ మహేష్ బాబు అన్నారు రేపల్లె మండలం లోని గుడ్డికాయ లంక పిరాట్ లంక గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా వ్యవసాయ శాఖ ద్వారా అమలు అవుతున్న వివిధ పథకాల గురించి రైతులకు వివరించడం జరిగింది ముఖ్యంగా ఈ పంట నమోదు కార్యక్రమం రైతులందరూ కూడా ఫిబ్రవరి 20వ తారీకు లోపు నమోదు చేసుకొని ఈకేవైసీ కూడా చేయించుకోవాలని తెలిపారు అలాగే ప్రతి ఒక్క రైతు కూడా ఆంధ్రప్రదేశ్ ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్ నందు ఐడిని పొందాలని ఎవరైనా రైతులు ఇంకా యూనిక్ ఐడి పొందని యెడల గ్రామ సచివాలయంలో లేదా ఆర్ఎస్కే లలో రైతు సేవ సహాయకుల్ని సంప్రదించాలని తెలిపారు రైతుకు సంబంధించిన విశిష్ట సంఖ్య లేనియెడల ప్రభుత్వం ద్వారా కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే పథకాలకు అనర్హులవుతారని తెలియపరచడం జరిగింది ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు లు పాల్గొన్నారు

## పాఠశాలకు టేబుల్ బహుకరించిన దాత మాదినేని లక్ష్మయ్య

మార్కాపురం జిల్లా ప్రతినిధి, సింహగర్జన (ముత్యాల నరేష్ రెడ్డి) జనవరి 28 : మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు మాదినేని లక్ష్మయ్య వితరణగా ఒక టేబుల్ ను ఇవ్వటం జరిగింది. పాఠశాలకు అవసరాలు ఏమైనా ఉంటే తమ వంతు తప్పక సహకరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జగన్నాధం ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ ప్రజలు, ప్రభుత్వం భాగస్వామ్యం అయితేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్కిపోగు ఆంథోనీ, ఉపాధ్యాయులు తోట శ్రీనివాసులు, పున్నమ్మ, అరుణ దాతను ఘనంగా సన్మానించారు.






## లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

అన్నవరం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 28 : లైన్స్ క్లబ్ అన్నవరం సత్యదేవ వారి ఆధ్వర్యంలో లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ అడపా సత్యనారాయణ చేతుల మీదగా శ్రీ సత్య దేవా సంస్కృత ఉన్నత పాఠశాల నందు పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అదే విధంగా పిల్లలకు స్నాక్స్ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ పొన్నాడ సూరిబాబు, ట్రెజరర్ బుద్దిగ వాసు మరియు సభ్యులు దొంకాడ గిరి, మచ్చా నాగేశ్వరరావు, కాలుబోయిన సత్యనారాయణ, నానాజీ, సత్యేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ కవితల పోటీల్లో ఆళ్లకు ద్వితీయ స్థానం



77వ గణతంత్ర దినోత్సవంను పురస్కరించుకొని ప్రదన్య సాహితీ వేదిక వాట్సప్ సమూహం వారు రాష్ట్ర స్థాయిలో మా భారతదేశం అను అంశం పై నిర్వహించిన వచన కవితల పోటీల్లో తెనాలికి చెందిన కవి, రచయిత, ఆర్టీసీ కండక్టర్, సాహితిబందువు డా. ఆళ్ళ నాగేశ్వరరావు (కమల శ్రీ) రచించిన నా దేశం అనే కవిత, ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు ఆ సంస్థ వ్యవస్థపక అధ్యక్షుడు జి.జయకృష్ణ,సహ వ్యవస్థపక అధ్యక్షుడు బి.తేజస్వినిలు పంపిన అభినందన పూర్వక ప్రశంసాపత్రమును బుదవారం వాట్సప్ వేదికగా అందుకున్నారు. వృత్తిపరంగా గుంటూరు 2 డిపోలో ఆర్టీసీ కండక్టర్ గా విధులు నిర్వర్తిస్తూ, ప్రవృత్తిగా గత నాలుగు దశాబ్దములుగా సాహితీ సేద్యం చేస్తూ, పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో అవార్డులు అందుకున్న డా. ఆళ్ళ నాగేశ్వరరావు (కమల శ్రీ)ని గుంటూరు జిల్లా ప్రజా రవాణా అధికారిణి కె.సామ్రాజ్యం, గుంటూరు 2 డిపో మేనేజర్ సిహెచ్.సునీత, ఎస్.టి.ఐ జి.మంగమ్మ మరియు ఆర్టీసీ సిబ్బంది, కార్మికులు, స్థానిక కవులు, కళాకారులు, సాహితీవేత్తలు అభినందించారు

## ఉండ్రాజవరం హైస్కూల్‌కు బహుమతుల పంట




ఉండ్రాజవరం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 28 : ఇటీవల తణుకు పట్టణంలో శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం వారు నిర్వహించిన "బాలోత్సవం"లో ఉండ్రాజవరంలోని శ్రీమతి మల్లిన వెంకట నరసమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని వివిధ పోటీల్లో బహుమతులు గెలుచుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొట్లచెరువు రామకృష్ణ తెలిపారు. జి.రిషిత కథ చెప్పడంలో ప్రథమ బహుమతి, డి.సత్య వేణి, బి.శాంతి, డి.కుందన గౌరి క్విజ్ లో ద్వితీయ బహుమతి, యం.సత్యవేణి వ్యాస రచనలో కన్సోలేషన్ బహుమతి, యం.నీలిమ తెలుగులో మాట్లాడటంలో ద్వితీయ బహుమతి, బి.హర్ష ఫాన్సీ డ్రస్ లో కన్సోలేషన్ బహుమతి, శాంతి ప్రియ పద్యం, భావం చెప్పడంలో కన్సోలేషన్ బహుమతి పొందారని ప్రధానోపాధ్యాయులు పొట్లచరువు రామకృష్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థినీ విద్యార్థులను, విద్యార్థినీవిద్యార్థులకు తర్ఫీదు ఇచ్చి, పోటీలకు తీసుకుని వెళ్ళిన ఆంగ్ల భాష ఉపాధ్యాయిని యం.నీలవేణి, సెకండరీ గ్రేడు ఉపాధ్యాయిని యం.సాయి మాధవిలను బుధవారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో ప్రధానోపాధ్యాయులు పొట్లచెరువు రామకృష్ణ అభినందించారు.

## ఐవిఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా కోనా శ్రీనివాసరావు

నరసరావుపేట, సింహగర్జన ప్రతినిధి, జనవరి 28 : నరసరావుపేట పట్టణంలోని బత్తుల మురళి స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫిబ్రవరి 1వ తేదీన తాడేపల్లిగూడెంలో ఐవిఎఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా కోనా శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా బత్తుల మురళి ముఖ్య అతిథులుగా టీజీ వెంకటేష్, టీజీ భరత్ శ్రీరామ్ తాతయ్య రాజమౌళి గుప్తా, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, గౌరవ అధ్యక్షుడు దూండి రాకేష్, కోన శ్రీనివాసరావు, సేవా తత్పరులు, స్నేహశీలి ఎంతోమందికి సహాయ సహకారాలు చేస్తూ ఎన్నో పదవులు అలంకరిస్తూ ఏకైక వ్యక్తి ఈ కార్యక్రమానికి స్టేట్ అధికార ప్రతినిధి యక్కల సుజాత, పలనాడు జిల్లా అధ్యక్షురాలు నంబూరు లీలాకుమారి, ఐవిఎఫ్ ఉపాధ్యక్షురాలు చీదేళ్ళ అన్నపూర్ణ, పిఆర్‌ఓగా కోటా వాణి, సహాయ కార్యదర్శి బత్తుల రాధిక నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో బొగ్గారపు బ్రహ్మానందం, కొత్తమాసు వెంకయ్య, దేవిశెట్టి సుధారాణి తదితరులు పాల్గొన్నారు. బత్తుల మురళి అందరికి అభినందనలు తెలిపారు



# ‘భగవంతుడు‘ టీజర్: మరో ‘కాంతారా’ అవుతుందా?

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, జనవరి 28 : రవి పనస ఫిల్మ్ కార్పొరేషన్ నుంచి రూపొందుతున్న తొలి నిర్మాణ చిత్రం “భగవంతుడు” విడుదలకు ముందే మంచి అంచనాలు పెంచుతోంది. జనవరి 30న టీజర్ విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం, దాని నటీనటులు, సాంకేతిక నైపుణ్యం, నేలతో ముడిపడిన కథాంశంతో సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. టాలీవుడ్‌లో తనదైన గుర్తింపు పొందిన తిరువీర్ ఈ చిత్రంలో ‘భగవంతుడు’గా శక్తివంతమైన ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. నేల వాసన పీల్చే పాత్రకు తిరువీర్ తన సహజ నటనతో ప్రాణం పోస్తారని చిత్ర బృందం నమ్మకం వ్యక్తం చేస్తోంది. కథానాయికగా ఫారియా అబ్దుల్లా నటిస్తూ, తన చార్మ్‌తో పాటు భావోద్వేగ లోతును తెరపై ఆవిష్కరించనున్నారు. ముఖ్య పాత్రలో రిషి నాగరాజు కనిపించి కథను మరింత బలపరుస్తారు. జీజీ విహారి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం గట్టి కథనం మరియు గ్రౌండెడ్ స్టోరీటెల్లింగ్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునేలా తెరకెక్కుతోంది. ఈ చిత్రాన్ని రవి కుమార్ పనస నిర్మిస్తున్నారు. ఆయనకు 25 ఏళ్లకు పైగా జర్నలిస్ట్, ఫిల్మ్ మ్యాగజైన్ ఎడిటర్, పీఆర్, ప్రొడక్షన్ డిజైనర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్, కో-ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్, మల్టీప్లెక్స్ యజమానిగా విస్తృత అనుభవం ఉంది. ఈ సినిమాను దివంగత పనస శంకరయ్య గౌడ్ సమర్పించడం వల్ల ఈ ప్రాజెక్ట్‌కు భావోద్వేగ విలువతో పాటు ఒక వారసత్వం కూడా జతకలిసింది. సాంకేతికంగా కూడా “భగవంతుడు” ప్రత్యేకంగా నిలుస్తోంది. సంగీతం హెచ్ఐ కేపీ, సినిమాటోగ్రఫీ రాజ్ తోట, ఎడిటింగ్ జాతీయ అవార్డు గ్రహీత ప్రవీణ్ పూడి అందిస్తున్నారు. పాన్ ఇండియా స్టార్‌ల అవసరం లేకుండానే నేలతో ముడిపడిన కథలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలు సాధిస్తున్నాయి. దీనికి ఉదాహరణగా ‘కాంతారా’ నిలుస్తోంది. ఆ చిత్ర విజయానంతరమే అందులో నటించిన హీరో పాన్ ఇండియా స్థాయికి ఎదిగారు. అదే తరహాలో “భగవంతుడు” కూడా తన కంటెంట్, కథనంతో అదే మాయను పునరావృతం చేస్తుందని చిత్ర బృందం విశ్వాసంగా ఉంది. టీజర్ విడుదలకు ముందు నుంచే ఆసక్తిని రేకెత్తిస్తున్న “భగవంతుడు”, ప్రేక్షకులకు ఓ ప్రత్యేకమైన సినిమాటిక్ అనుభవాన్ని అందిస్తుందనే అంచనాలు పెరుగుతున్నాయి. మాగల్ఫ్ న్యూస్ ఈ సినిమాలో ఒక మీడియా పార్టనర్ గా వ్యవహరిస్తోంది.




# ఈటీవీ విన్ ప్రేక్షకుల హృదయాలు గెలుచుకుంటున్న

# ముళ్ళపూడి వరా “గొల్ల రామవ్వ“



హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, జనవరి 28 : స్వర్గీయ భారత ప్రధాని పి.వి.నరసింహారావు రాసిన తెలంగాణ సాయుధ పోరాటగాథకు దృశ్యరూపంగా ముళ్లపూడి వరా దర్శకత్వంలో తెరకెక్కిన రోమాంఛిత వీరగాథ “గొల్ల రామవ్వ“కు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. జనవరి 25 నుంచి ఈటీవీ విన్ లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రానికి అసాధారణ స్పందన లభిస్తోంది. ఈ చిత్రాన్ని సుచేత డ్రీమ్ వర్క్స్ ప్రొడక్షన్ - వర్మ డ్రీమ్ క్రియేషన్స్ పతాకాలపై... రామ్ విశ్వాస్ హనూర్కర్ - రాఘవేంద్రవర్మ (బుజ్జి) సంయుక్తంగా నిర్మించారు. అజహర్ షేక్ ఈ చిత్రానికి కార్యనిర్వాహక నిర్మాతగా కీలక బాధ్యతలు నిర్వహించడంతోపాటు... సాహిత్యం సమకూర్చారు. ఇంతకుముందు ఈటీవీ విన్ కోసం “మౌనమే నీ భాష“ చిత్రాన్ని నిర్మించి, వీక్షకుల నుంచి విశేష ఆదరణ పొందిన టీమ్ నుంచి వచ్చిన “గొల్ల రామవ్వ“ రెట్టింపు స్పందన రాబడుతుండడం విశేషం. “తెలుగు సీతామాలక్ష్మి“ తాళ్ళూరి రామేశ్వరి టైటిల్ పాత్రలో తెరకెక్కిన ఈ చిత్రంపై కురుస్తున్న ప్రశంసల వర్షంపై చిత్ర దర్శకుడు ముళ్ళపూడి వరా హర్షం వ్యక్తం చేశారు. నిర్మాతలు రామ్ విశ్వాస్ హనూర్కర్ - రాఘవేంద్రవర్మ (బుజ్జి)లతో పాటు ఈ చిత్ర రూపకల్పనలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. పి.వి.నరసింహారావు కుమారుడు పి.వి.ప్రభాకరరావు, కుమార్తె సురభి వాణీదేవిలకు కూడా ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అల్లు గీత, అన్విత్, మణి మంతెన ఇతర ముఖ్యపాత్రలు పోషించిన ఈ చిత్రానికి పి.ఆర్.ఓ : ధీరజ్-అప్పాజీ, గానం : వరం, సంగీతం : సాయి మధుకర్, ఛాయాగ్రహణం : గంగమోని శేఖర్, కూర్పు : రాఘవేంద్రవర్మ, రచన : బయ్యవరపు రవి, కార్యనిర్వాహక నిర్మాత & సాహిత్యం : అజహర్ షేక్, నిర్మాతలు : రామ్ విశ్వాస్ హనూర్కర్ - రాఘవేంద్రవర్మ (బుజ్జి), చిత్రానువాదం - దర్శకత్వం : ముళ్ళపూడి వరా.

# నేనిక లేనని తెలిసాక



“నేనిక లేనని తెలిశాక విషాదాశ్రులను  
వర్షిస్తాయి నీ కళ్ళు..  
కానీ మిత్రమా! అదంతా నా కంట పడదు!  
ఆ విలాపమేదో ఇపుడే నా సమక్షంలోనే కానిస్తే పోలా!

నీవు పంపించే పుష్పగుచ్ఛాలను  
నా పార్థివదేహం  
ఎలా చూడగలదు?  
అందుకే... అవేవో ఇప్పుడే పంప రాదా!

నా గురించి నాలుగు మంచి మాటలు పలుకుతావ్ అప్పుడు  
కానీ అవి నా చెవిన పడవు..  
అందుకే ఆ మెచ్చేదేదో ఇప్పుడే మెచ్చుకో !

నేనంటూ మిగలని నాడు నా తప్పులు క్షమిస్తావు నువ్వు !  
కానీ నాకా సంగతి తెలీదు..  
అదేదో ఇపుడే క్షమించేయలేవా?!


నన్ను కోల్పోయిన లోటు నీకు కష్టంగా తోస్తుంది  
కానీ అది నాకెలా తెలుస్తుంది?  
అందుకని ఇప్పుడే కలిసి కూర్చుందాం కాసేపైనా !

నాతో మరింత సమయం గడిపి ఉండాల్సిందని నీకనిపిస్తుంది  
అదేదో ఇప్పుడే గడపవచ్చుగా మనసారా!

సానుభూతి తెలపడానికి నా ఇంటి వైపు అడుగులు వేస్తావ్.. నా మరణ వార్త విన్నాక!  
సంవత్సరాలుగా మనం ఏం మాట్లాడుకున్నామని?

ఇప్పుడే నావైపు చూడు, నాతో మాట్లాడు, బదులు పలుకుతాను, కాసేపైనా గడుపుతాను, హాయిగా నీతో మెలుగుతాను!“

- విశ్వ కవి రవీంద్రనాథ్ వారి కలం నుండి జాలువారిన మనసు పలికిన మాటలు







Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com